క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఏలూరు (టూటౌన్): ప్రయాణాల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు మంగళవారం రాత్రి అవగాహన కల్పించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్‌శివ కిషోర్, ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ ఆదేశాలపై ఏలూరు పాత బస్టాండులో ఏలూరు-1 టౌన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బందితో కలిసి నిఘా వ్యవస్థ పనితీరును పరిశీలించారు. పాత బస్టాండ్‌లో ఎటువంటి దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. బస్టాండ్‌లో లైటింగ్ సౌకర్యం, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆర్టీసీ అధికారులకు తగిన సూచనలు, సలహాలిచ్చారు.

చేతుల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

భీమడోలు: చేతుల పరిశుభ్రత ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని అన్నేవారిగూడెం యూపీ పాఠశాల హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ అన్నారు. దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి, చేతుల పరిశుభ్రత దినోత్సవాలను నిర్వహించారు. తొలుత అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. అనంతరం చేతుల పరిశుభ్రత పట్ల చిన్నారులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో దాసరి చైతన్యకృష్ణకుమార్, వక్తృత్వ పోటీలో లక్ష్మీదీపిక, చిత్రలేఖనంలో చిన్నం ప్రేమామృత, క్విజ్‌లో బాలప్రసన్న, భవానీ విజేతలుగా నిలిచారు. వారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సామాజిక కార్యకర్త మండే సుధాకర్ కలాం చిత్రపటానికి మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

చేతుల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గణపవరం: చేతుల పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని గణపవరం పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ అన్నారు. మంగళవారం ప్రపంచ చేతుల పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా గణపవరంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వద్ద చేతుల పరిశుభ్రతపై అవగాహన సదస్సు, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.

గ్రీవెన్స్‌కు స్పందన కరువు


ఏలూరు రూరల్: ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం అధికారులు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ వి శ్రీలతతో పాటు పంచాయతీరాజ్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈతో పాటు రెవెన్యూ అధికారులు హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమైన గ్రీవెన్స్‌లో ఫిర్యాదుదారులు ఎవ్వరూ రాకపోవడంతో అధికారులు మధ్యాహ్నం కార్యాలయాల బాట పట్టారు. సోమవారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్ మద్యం షాపుల ఖరారు కార్యక్రమం వల్ల మంగళవారం వాయిదా పడిన సంగతి తెలిసిందే.

ప్రజా సమస్యలపై నాలుగు వినతులు

దెందులూరు: మండలంలో వివిధ ప్రాంతాల నుంచి నాలుగు ప్రజా సమస్యలపై వినతులు అందాయని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్ఐ హేమమాలినికి సూచించారు. ఎంపీడీఓ కే.శ్రీదేవి, ఎంఈఓలు ఏవీఎస్‌వీ ప్రసాద్, కే. అన్నమ్మ, వెలుగు ఏపీఎం సురేష్, ఉపాధి ఏపీఓ దశరథ రామ్‌జీ హాజరయ్యారు.

అటకెక్కిన పేదల సంక్షేమం

- అధిక ధరలతో ప్రజలు విలవిల
- సూపర్ సిక్స్ అమలు చేయని కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ హయాంలో పేదలకు పథకాల రూపంలో లబ్ధి
- 15 గ్రామ పంచాయతీల్లో 74,890 మంది లబ్ధిదారులు



ఏలూరు రూరల్: కూటమి ప్రభుత్వం హయాంలో పేదల సంక్షేమం అటకెక్కింది. వృద్ధుల పింఛన్ పెంపు తప్ప, రైతులు, చిరు వ్యాపారులు, నిరుద్యోగులు, మహిళలకు ఒక్క పథకమైనా అమలు కాలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయ్యింది. సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ప్రకటించిన సంక్షేమ పథకాలు అమలు చేయలేదు. నిత్యావసర ధరలు మండిపోతున్నాయి. ఫలితంగా బడుగు వర్గాల ప్రజలకు ఆర్థిక సమస్యలతో అవస్థలు పడుతున్నారు. సాగుదారులకు ఏడాది రూ.20 వేలు అందిస్తానని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఖరీఫ్ ప్రారంభమై నెలలు పూర్తి కావస్తోంది. నేటికీ రైతన్నలకు సాగు పెట్టుబడికి చిల్లిగవ్వ కూడా అందించలేదు. ఇటీవల వచ్చిన వరదలకు నష్టపోయిన రైతులకు పరిహారం అందించలేదు. రెక్కాడితే గాని డొక్కాడని చిరుద్యోగులకు కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందిస్తామని ఆశ కల్పించారు. నేటికీ ఒక్కపైసా ఆర్థిక చేయూత చేయలేదు. ప్రతి మహిళకు మూడు సిలిండర్లు, ఉచిత బస్ ప్రయాణం ఊసే లేదు. నిరుద్యోగ భృతి కల్పిస్తామని, లక్షలాది ఉద్యోగాలు సృష్టిస్తామని విస్మరించారు. ఉద్యోగ భృతి దేవుడెరుగు, కనీసం ఉపాధి అవకాశాలు కల్పించడం లేదంటూ యువత ఆవేదన వ్యక్తం చేస్తోంది. కొత్త ప్రభుత్వం హయాంలో అధికారులు గ్రామాల్లో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదు.

జగన్ పాలనలో పేదలకు దన్నుగా పథకాలు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదలకు దన్నుగా నిలిచాయి. అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన తదితర పథకాల ద్వారా పేద పిల్లలు ఉన్నత విద్య వైపు అడుగులు వేశారు. వాహన మిత్ర, కాపు నేస్తం, ఈబీసీ నేస్తంతో యువత ఉద్యోగం, వ్యాపారం రంగాల్లో రాణించారు. వ్యవసాయం, ఆక్వా రంగంలో రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ పథకాలు ఎంతో ఉపయోగపడ్డాయి. సున్నా వడ్డీ, వైఎస్ఆర్ చేయూత, మహిళలు ఆర్థిక స్వావలంబన వైపు అడుగులు వేశారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం పేదల సొంతింటి కల సాకారం చేశాయి.

కోట్ల రూపాయలు లబ్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్స్ ట్రాన్స్‌ఫర్స్) నాన్ డీబీటీ (ఇన్‌డైరెక్ట్ బెనిఫిట్స్) పథకాల ద్వారా పేదలు కోట్ల రూపాయల లబ్ధి పొందారు. ఐదేళ్లలో ఏలూరు రూరల్ మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో 74,890 మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందాయి. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, రైతు భరోసా, సున్నా వడ్డీ, కాపు నేస్తం, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ తదితర 25 డీబీటీ పథకాల ద్వారా 51,578 మంది పేదలు రూ.159,87,42,591 అందుకోవడం విశేషం. మరో 23,312 మంది 8 నాన్ డీబీటీ పథకాలైన ఇంటి స్థలం, విద్యాకానుక, జగనన్న తోడు, గోరుముద్ద, రైస్‌కార్డు, కంటి వెలుగు, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, విద్యార్థులకు ట్యాబ్స్ ద్వారా మరో రూ.106,20,56,368 విలువైన సేవలు పొందారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లు అమలు చేసిన పథకాలు పేద, మధ్య తరగతి ప్రజల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించాయి. ఈ పథకాలన్నీ నేటి కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. ఫలితంగా పేదల్లో నిరాశ గూడుకట్టుకుంటోంది.

వైఎస్ జగన్ మాట నిలబెట్టుకున్నారు



2019 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేశారు. చంద్రబాబునాయుడు మాయ మాటలతో ప్రజలను మోసగించి మరోసారి సీఎం అయ్యారు. 100 రోజులు పూర్తి అయినప్పటికీ హామీలు అమలు చేయడంలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందించారు. పథకాలు పేదలను ఆర్థికంగా నిలబెట్టింది. మహిళలు ధైర్యంగా వ్యాపారాలు చేపట్టి ఆర్థికంగా లబ్ధి పొందారు.

– ముంగర సంజీవ్‌కుమార్, పైడిచింతపాడు,
వైఎస్సార్‌సీపీ వడ్డీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు

గత పాలనలో పేదలకు ఆర్థిక చేయూత



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన వైఎస్ఆర్ చేయూత పథకం పేద కుటుంబాలకు ఆర్థిక చేయూతగా నిలిచింది. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబం రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకూ లబ్ధిపొందారు. ఈ మొత్తంతో చిరు వ్యాపారాలు చేసి ఆర్థిక స్వావలంబన సాధించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అమలుచేసిన పథకాలను కూటమి ప్రభుత్వం యథాతథంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– పల్లెం ప్రసాద్, పైడిచింతపాడు.
రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ డైరక్టర్

ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన గుజరాత్ బృందం



వెంకటాపురంలో ప్రకృతి సాగు విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు, గుజరాతీ బృందం

ఏలూరు(మెట్రో)/ఏలూరు రూరల్: ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించేందుకు గుజరాత్ రాష్ట్రం నుంచి ప్రతినిధులు జిల్లాలో పర్యటించారని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు బి.తాతారావు మంగళవారం తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ఏలూరు రూరల్ మండలం వెంకటాపురంలో రైతు సాధికార సంస్థ సభ్యులు ప్రదర్శించిన సార్వత్రిక సూత్రాలను, వరి కాంపాక్ట్ బ్లాక్‌ను వారు పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఆదాయ, వ్యయాలపై ఆరా తీశారు. అనంతరం ఏలూరు జిల్లా, అమ్మపాలెంలోని కొటారు రంగయ్య ఫైవ్ లేయర్ మోడల్‌ను పరిశీలించారు. జీవామృతం తయారీని అడిగి తెలుసుకున్నారు. ఐజీజీఏఏఆర్‌ఎల్ రైతు శాస్త్రవేత్తలు, మెంటార్స్‌ను కలిసి వారితో మాట్లాడారు. లక్ష్మీపురం, తడికలపూడి, గుండుగోలనుకుంట, ద్వారకతిరుమలలో వారు పర్యటించి వివిధ పంటలను పరిశీలించారు. ఈ పర్యటనలో నందిని శ్రీ వాస్తవ, చంద్రిక అశోక్ (అతాపీ సేవ ఫౌండేషన్), నవీన్ పటిధర్, కృష్ణ సాహూ, హర్పాల్, ప్రవీణ్ బికాడియ, బాబు ప్రజాపతి, (ఉత్థాన్ ట్రస్ట్), హరి గోవన్ పటేల్ (వసుంధర ఫౌండేషన్), ఆజాద్ పగడా, దివ్యాన్ ప్రజాపతి, డా. సీకే తెంబాడియా, అల్పేష్ బీమాని, ప్రమీల్ కుమార్ గుప్తా, ఆదిత్యామీన్, మోహన్ శర్మ, అమర్సి చౌహాన్, దేవ్సి పర్మర్ (సేతు అభియాన్), తాతారావు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు కేటాయించాలి



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ కె.వెట్రి సెల్వికి వినతిపత్రం అందజేస్తున్న సిటీ పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలోని క్రైస్తవుల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు, శ్మశాన వాటిక కోసం స్థలాన్ని కేటాయించాలని ఏలూరు సిటీ పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందజేసారు. ఏలూరు నగరంరలో 180 వరకు క్రైస్తవ సంఘాలున్నాయని ప్రధానంగా తాము రెండు సమస్యలను ఎదుర్కొంటున్నామని వాటి పరిష్కారానికి కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు. ప్రధానంగా 2003లో అప్పటి ముఖ్యమంత్రి ఏఎస్ఆర్ స్టేడియం సమీపంలో క్రైస్తవ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలాన్ని మంజూరు చేశారని, నేటికీ ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణం చేపట్టలేదన్నారు. తక్షణం క్రైస్తవ కమ్యూనిటీ హాలు నిర్మాణం నిమిత్తం నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఏలూరులో క్రైస్తవుల సమాధుల తోటకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన వారిలో ఏలూరు సిటీ పాస్టర్స్ అసోసియేషన్ ఛీఫ్ ప్రొట్యన్ పి.జీవన్ కుమార్, అధ్యక్షుడు కె.సుదర్శన్ బాబు, కార్యదర్శి ఇ.రత్నప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎల్ పాల్, కోశాధికారి చిక్కాల జోసెఫ్, ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్ ఛైర్మన్ పెరికె వరప్రసాదరావు పాల్గొన్నారు.

డాక్టర్ అబ్దుల్ కలాంకు ఘన నివాళులు

భీమడోలు: భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన క్షిపణి పితామహుడు, భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని భీమడోలు సర్కిల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పిల్లి బ్రహ్మారావు అన్నారు. భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం 93వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం భీమడోలు ఫొటోగ్రాఫర్ల యూనియన్ ఆధ్వర్యంలో భీమ డోలు సంత మార్కెట్‌వద్ద అబ్దుల్ కలాం, డాగ్యూరే విగ్రహాలకు పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షుడు ద్రాక్షారపు విశ్వనాథం అధ్యక్షత వహించారు. ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బరజాపు రంగారావు, ప్రతినిధులు పీవీఆర్ మూర్తి, డి.డేవిడ్, నాగరాజు, రంగారావు పాల్గొన్నారు.

ఉప్పాకపాడు పాఠశాలలో..

ఉంగుటూరు: అబ్దుల్ కలామ్ దేశానికి అందించిన సేవలు ఆదర్శనీయమని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అల్లు శ్రీను అన్నారు. ఉప్పాకపాడు పాఠశాల వద్ద అబ్దుల్ కలామ్ విగ్రహం వద్ద జయంతి మంగళవారం నిర్వహించారు. హెచ్‌ఎం నక్కా సుధాకర్ టీచరు శ్రీదేవి, మాకా రత్నకుమారి పాల్గొన్నారు.



భీమడోలులో అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద జోహార్లు అర్పిస్తున్న పి.బ్రహ్మారావు, తదితరులు

డాక్టర్ అబ్దుల్ కలాం యువతకు ఆదర్శప్రాయులు

దెందులూరు: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం యువతకు ఆదర్శప్రాయమని దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. మంగళవారం కళాశాలలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 93వ జయంతి నిర్వహించారు. అనంతరం కళాశాల విద్యార్థులు ఆయన జీవిత విశేషాలను వివరించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అబ్దుల్ కలాం సేవలు ఆదర్శనీయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పేపర్ బాయ్‌గా ప్రస్థానం ప్రారంభించి దేశ ప్రథమ పౌరుని స్థాయికి ఎదిగిన అబ్దుల్ కలాంను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని యాంటినోరీ సోషల్ సర్వీస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ తోట ఎడ్వర్డ్ తెలిపారు. భారత మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం మంగళవారం స్థానిక యాంటీనోరీ సోషల్ సర్వీస్ సొసైటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్వర్డ్ మాట్లాడుతూ పేదరికం మనిషి ఎదుగుదలకు ఆటంకం కాదని అబ్దుల్ కలాం నిరూపించారన్నారు. కలలు కనడంతో పాటు వాటిని నెరవేర్చుకునే దిశగా అకుంఠిత దీక్ష, పట్టుదలతో కృషి చేయాలని కలాం చెప్పారన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే తత్వాన్ని భావితరాలకు ఉద్బోధించిన కలాం ప్రపంచానికి దిక్సూచిగా నిలిచారన్నారు. తొలుత కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు కరీముల్లా, టి.సుధీర్, ఎస్.రాకేష్, ఎస్.దాసు, టి.విజయ కుమారి, కె.జ్యోతి పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కళ్లజోళ్ల పంపిణీ

అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని నగరానికి చెందిన మాతృదేవోభవ సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రామచంద్రరావు పేట వేరియంట్ స్కూల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు అబ్దుల్ కలాం స్ఫూర్తితో ముందుకు వచ్చి కళ్లజోళ్లకు నగదు సమకూర్చడం అభినందనీయమని మాతృదేవోభవ సంస్థ ప్రతినిధి కె.సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు వేమ హరినారాయణ, మానేపల్లి రామారావు, పిల్లి పండరీనాథ్, మేతర అజయ్ బాబు, స్కూల్ ప్రిన్సిపాల్ కె.కృష్ణ సుధ, కరస్పాండెంట్ కె.మనోహర్ పాల్గొన్నారు.

కలలను సాకారం చేసుకోండి

భీమడోలు: విద్యార్థులంతా కలలు కనండి వాటిని సాకారం చేసుకునేలా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని భీమడోలు ఎస్సై వై.సుధాకర్ అన్నారు. భీమడోలు మాధురి కళాశాలలో మంగళవారం మిస్సైల్ మాన్ ఆఫ్ ఇండియా, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ప్రపంచ విద్యార్థుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్సై వై.సుధాకర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆడపిల్లల భద్రత, ర్యాగింగ్, గుడ్ టచ్– బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి పి.బాలు అధ్యక్షత వహించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ఆకతాయిల బెడద నుంచి రక్షించుకునేందుకు ఫోన్ నంబర్ 112ను సంప్రదించాలన్నారు. ప్రిన్సిపాల్స్ అశోక్, కేసరి, భువనేశ్వరి పాల్గొన్నారు.

కొలనువాడ మార్గదర్శకులు

దెందులూరు: చల్లచింతలపూడి మాజీ సర్పంచ్, సంఘ సేవకులు కొలనువాడ సత్యనారాయణరాజు ప్రజాప్రతినిధులందరికీ ఆదర్శప్రాయులని చల్లచింతలపూడి, రామారావుగూడెం మాజీ సర్పంచ్‌లు సింహాద్రి శ్రీమన్నారాయణ, పుల్లా శ్రీనివాసరావు, పేరం ప్రసాద్, అన్నారు. మంగళవారం చల్లచింతలపూడి, తిమ్మన్నగూడెంలో కొలనువాడ సత్యనారాయణరాజు శతజయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ఆధ్యాత్మిక, విద్యా, వైద్య, సేవా రంగాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెట్ట గ్రామాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఆయనకు నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, దెందులూరు మాజీ ఎంపీపీ కొలనువాడ కృష్ణంరాజు ఉన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు అన్నారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్‌శివకిషోర్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, మహిళా ఎస్సై కాంతి ప్రియ, సిబ్బందితో కలిసి స్థానిక రామకోటి వద్ద ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు మంగళవారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు విద్యార్థినులతో మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన పోక్సో చట్టాన్ని వివరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలపై బాలికల రక్షణ కోసం ప్రత్యేకంగా మహిళా పోలీస్ స్టేషన్ మహిళా సిబ్బంది ద్వారా విద్యాసంస్థల వద్ద గస్తీ నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యాలయాల వద్ద ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే వెంటనే డయల్ 112కి సమాచారం అందించిన పది నిమిషాల వ్యవధిలో పోలీసులు మీకు రక్షణ కల్పిస్తారని అన్నారు. తమ చుట్టుపక్కల ఎవరైనా సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930కి సమాచారాన్ని అందిస్తే వారికి పోలీసులు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు.



విద్యార్థినులకు చట్టాలను వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు

వైభవంగా అమ్మవారి రథయాత్ర

నిడమర్రు: దసరా ముగింపు ఉత్సవాల్లో భాగంగా బువ్వనపల్లి ఉమా మార్కేండేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న దుర్గామాత రథోత్సవం మంగళవారం కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విచిత్ర వేషధారణలు, బుట్టబొమ్మలు, డీజే బ్యాండ్‌లతో ఈ రథయాత్ర బువ్వనపల్లి సత్యనారాయణపురం నుంచి గణపవరం బొబ్బిలి వంతెన వరకూ సందడిగా నిర్వహించారు. అమ్మవారి రథాన్ని లాగేందుకు అందరూ పోటీ పడ్డారు. ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ అలుమోలు అంతర్వేది ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



బువ్వనపల్లిలో అమ్మవారి ఊరేగింపు రథాన్ని లాగుతున్న భక్తులు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	15
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	13
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం (ఇంద్ర)	20.15	01
ఏలూరు – తిరుపతి (ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	05
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	07
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	02
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	01
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	02
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	18
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.20	98505	32
ఏలూరు – తిరుపతి	16.00	4830	31

భారీ వర్షాలు.. పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు

భీమడోలు: వానాకాలం విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉంటాయి. దీనికి తోడుగా తుఫాన్ కారణంగా కురిసే ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలతో మరింత ప్రమాదాలు సంభవిస్తాయి. వర్షాకాలంలో వానలు, గాలులకు చెట్ల కొమ్మలతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగిపోతుంటాయి. విద్యుత్ తీగలు కిందకు జారిపోతాయి. వాటిని నిర్లక్ష్యం చేస్తే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. ఏ మాత్రం ఆదమరిచినా దాని ఫలితం తీవ్రంగా ఉంటుంది. అందుకే ఈ సీజన్‌లో రైతులు, ప్రజలు విద్యుత్ వినియోగంతో జాగ్రత్తలు పాటించాల్సిందే. బోర్ల కింద, కాలువల కింద మోటార్లతో సాగు చేసే రైతాంగం మరింత అప్రమత్తంగా ఉండాలి. అల్పపీడన ప్రభావంతో మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. అనుమతి లేని వ్యక్తులు ఎటువంటి ఫ్యూజులు వేయరాదని, వీధి దీపాలు మార్చడం వంటి చేయకూడదని అధికారులు హెచ్చరిస్తున్నారు. విద్యుత్ తీగలు కిందకు వాలిన నేపథ్యంలో సంబంధిత సిబ్బందికి సమాచారం అందించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యలో ఉంటాయి. వాటికి రక్షణ కంచెలు కూడా ఉండవు. పంట పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతులు మైనర్ మరమ్మతులు చేపట్టే సమయంలో ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఏబీ స్విచ్ పూర్తిగా నిలిచిపోకపోతే విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

చేయకూడని పనులు

వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలను తాకవద్దని విద్యుత్ శాఖ సిబ్బంది సూచిస్తున్నారు. నీటిలో పడిన విద్యుత్ తీగల జోలికి ఎట్టి పరిస్థితుల్లో వెళ్లవద్దని, భవన నిర్మాణ కార్మికులు పనులు చేసే సమయంలో విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలంటున్నారు. తడి చేతులతో, తడి బట్టలతో విద్యుత్ పరికరాలను ముట్టరాదని, మరమ్మతులు చేయవద్దని సూచిస్తున్నారు. పిల్లలు అందుకునే ఎత్తులో స్విచ్ బోర్డులను ఉంచరాదని, స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మూత్ర విసర్జన చేయవద్దని అంటున్నారు. సొంతంగా ఇంటికి వైరింగ్ చేయడం, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్త వేయడం, అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలను ఎక్కడం, టీవీ, కేబుల్ వైర్లపై బట్టలు ఆరవేయడం వంటివి చేయరాదని హెచ్చరిస్తున్నారు. వర్షం కురుస్తున్నప్పుడు టీవీ, ఫ్రిజ్, కంప్యూటర్ స్విచ్‌లు ఆఫ్ చేయాలి. వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంది. విద్యుత్ సరఫరాలో సమస్యలుంటే సొంతంగా మరమ్మతులు చేసుకోవద్దు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

విద్యుత్ స్తంభంనుంచి వ్యవసాయ మోటార్‌కు మధ్య ఎక్కువ దూరం ఉండకుండా చూసుకోవాలి. మోటార్ పనిచేయని సమయాల్లో చేతితో దాని ని తాకరాదు. టెస్టర్‌ను ఉపయోగించి మాత్రమే పరీక్షించాలి. మోటార్‌వద్ద ఫ్యూజులు, ఇండికేటర్ బల్బులు, స్టార్టర్‌ను ఒక చెక్కపై బిగించుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోని ఇనుప డబ్బాలపై బిగించకూడదు.